క్లుప్తంగా

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన వీసీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల పరిధిలో జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం పరిశీలించారు. హిస్టరీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ తీరును ఆయన తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో పటిష్టంగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వీసీ వెంట ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, డాక్టర్ వి.ధనరాజ్, డాక్టర్ సీహెచ్.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ రోహిణి

ఆరిలోవ: జీవీఎంసీ పన్నెండో వార్డు లీలాసుందరి నగర్‌లో కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా ఇక్కడ రూ. 57.85 లక్షల జీవీఎంసీ నిధులతో ప్రధాన కాల్వలు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ వర్క్స్ ఏఈ వెంకటరావును ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు ఏడువాక సన్యాసిరావు, మోహన్, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఒత్తిడి నిర్వహణపై విద్యార్థులకు వర్క్‌షాప్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యాపరిషత్ కళాశాలలో 'ఒత్తిడి నిర్వహణ' అంశంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. మేనేజ్‌మెంట్ నిపుణుడు డాక్టర్ శర్వాని స్వామి అతిథిగా పాల్గొని వ్యక్తిగత, వృత్తి పరమైన జీవితంలో ఒత్తిడి ఎదుర్కోవడానికి అవసరమైన వ్యూహాలు, పద్ధతులను విద్యార్థులకు వివరించారు. పలు ఉదాహరణలు ద్వారా నిత్యజీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లకు పరిష్కార మార్గం తెలియజేశారు. కళాశాల పాలకమండలి సభ్యుడు డాక్టర్ ప్రగడ రాజగణపతి మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి సాధారణ సమస్యగా మారిందన్నారు. రోజువారి జీవితంలో ఒత్తిడి దరిచేరకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

29 నుంచి బిజినెస్ ఎక్స్ పో



మాట్లాడుతున్న చిట్టూరి శ్రీనాథ్

సీతమ్మధార: విజయవాడలో నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1 వరకు మూడు రోజులపాటు ఏపీ ఛాంబర్స్ ఆధ్వర్యంలో బిజినెస్ ఎక్స్ పో - 2024 నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ (ఏపీ ఛాంబర్స్) చైర్మన్ శ్రీనాథ్ చిట్టూరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆశీలమెట్టలోని ఒక హోటల్‌లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్లో 'ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పో - 2024' నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు. ఎక్స్ పోలో ఏర్పాటు చేయడానికి స్టాల్స్ ఖరారు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ విశాఖ ఛాప్టర్ ఉపాధ్యక్షులు శోభన్ ప్రకాష్, మాజీ అధ్యక్షుడు పైడా కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కళావిహీనం



తొండం విరిగిన ఏనుగు పిల్ల బొమ్మ



రంగులు వెలిసిన పులి బొమ్మ

- కళ తప్పిన పర్యాటక ప్రాంతాలు
- శిథిలావస్థకు చేరిన బొమ్మలు



దెబ్బతిని, పెచ్చులూడి కూలడానికి సిద్ధంగా ఉన్న డ్రాగన్

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులోని పర్యాటక ప్రాంతాలలో ప్రముఖమైన బొమ్మలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నిత్యం వేలాది మంది పర్యాటకులు, నగరవాసులు సందర్శించే ప్రదేశాలు కళావిహీనంగా తయారయ్యాయి. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ ప్రదేశాలు, బొమ్మలు నేడు దీనంగా చూస్తున్నాయి. బీచ్‌రోడ్డు వైఎంసీఏకి చేరువలో ఆల్ ఎబిలిటీ పార్క్ ఎదురుగా ఉన్న డ్రాగన్ బొమ్మ శిథిలస్థితిలో ఉంది. దీనికి ఒక కాలు పూర్తిగా విరిగిపోయి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. అదే విధంగా డ్రాగన్ బొమ్మల పొట్ట భాగంలో కూడా పలు చోట్ల రంధ్రాలు పడి, ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఇక్కడ ఫొటోలు తీసుకోవడానికి ఆసక్తి చూపుతారు. శిథిలస్థితిలో ఉన్న డ్రాగన్‌ను చూసి పర్యాటకులు నిరాశ చెందుతున్నారు. ఈ బొమ్మను దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మించారు. దీనికి అవసరమైన మరమ్మతులు చేసి పూర్వ వైభవం తీసుకురావాల్సి ఉంది.

ఏనుగు బొమ్మలదీ ఇదే పరిస్థితి

విశాఖ మ్యూజియం ఎదురుగా రోడ్డు పక్కనే ఉన్న ఏనుగు బొమ్మలు సైతం విరిగిపోయి కళావిహీనంగా తయారయ్యాయి. ఇక్కడ పెద్ద ఏనుగు, చిన్న ఏనుగు పిల్ల బొమ్మలను గతంలో ఏర్పాటు చేశారు. చిన్న ఏనుగు పిల్ల తొండం విరిగిపోయింది. అదే విధంగా తోక భాగంలో విరిగిపోయి ఇనుప ఊచలు ప్రమాదకరంగా బయటకు దర్శనమిస్తున్నాయి. ఏనుగు బొమ్మలు రెండూ రంగులు వెలిసిపోయాయి. చిన్న ఏనుగు బొమ్మతో ఫొటోలు తీసుకోవడం, పిల్లలు పట్టుకుని వేలాడటం, ఆటలు ఆడటం వంటివి చేస్తుంటారు. దీంతో ఇది తరచూ పాడవుతోంది. ఈ బొమ్మల చుట్టూ రెయిలింగ్ ఏర్పాటు చేస్తే పాడవకుండా ఉంటుంది. అలాగే ఫొటోలకు అనువుగా ఉంటుంది. అధికారులు వీటికి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.



రంగుల వెలిసి కళావిహీనంగా ఏనుగు బొమ్మలు

దేశ సమైక్యతకు రాజ్యాంగమే మూలం

- ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు
- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం
- వర్సిటీలోని విభాగాల్లో ఘనంగా వేడుకలు
- రాజ్యాంగ నిర్మాతకు నివాళులు



కృష్ణా డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు



ఇగ్నోలో రాజ్యాంగ స్ఫూర్తి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



బీజేపీ కార్యాలయంలో..



వీఎస్ కృష్ణా జూనియర్ కాలేజీలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: దేశ సమైక్యత, సమగ్రతకు రాజ్యాంగమే మూల కారణమని ఏయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూలోని పరిపాలనా భవనం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం భారతదేశాన్ని ఐక్యం చేసి, ప్రజలందరికీ సమాన హక్కులను అందించిందన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ, అండ్ బీసీ సీ టీచర్స్, ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ టి. షారోన్ రాజు వీసీ, రిజిస్ట్రార్లకు ప్రత్యేక జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు, ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు ఎం.వి.ఆర్ రాజు, డి.నగ రాజకుమారి, గిరిజా శంకర్, డీన్ అరుణకుమార్, ధనరాజ్, ఆచార్య పి.ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్ఈలో..

ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంతీయ కేంద్రం, ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇగ్నో ప్రాంతీయ సంచాలకుడు ఆచార్య ధర్మారావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్, ఇగ్నో ప్రాంతీయ సమన్వయాధికారి ఆచార్య నాగరాజకుమారి రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలను విద్యార్థులకు వివరించారు. ఇగ్నో డిప్యూటీ డైరెక్టర్ కృష్ణారావు, ఆచార్యులు ఎం.పుష్పరాజ్యం, రమణ తదితరులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన కళాశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

- ఏయూ విద్యావిభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు పాల్గొన్నారు. విదేశీ విద్యార్థులతో కలిసి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, విభాగాచార్యులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము తదితరులు, విద్యార్థులు, పరిశోధకులు, సిబ్బంది పాల్గొన్నారు.
- ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్. పద్మశ్రీ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ ప్రజ్ఞ, అరుణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

లా కాలేజీలో రక్తదాన శిబిరం

వర్సిటీ లా కాలేజీలో జరిగిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో వీసీ ఆచార్య శశిభూషణరావు పాల్గొన్నారు. లా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సీతా మాణిక్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ వై. సత్యనారాయణ వివిధ అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పొలిటికల్ సైన్స్, హిందీ తదితర విభాగాల్లోనూ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగమే వారధి

ఎంవీపీకాలనీ: అఖండ భారతావనిలో ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగం వారధివంటిదని ఎంవీపీ కాలనీ సంక్షేమ భవన్‌లోని పలువురు అధికారులు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంక్షేమ భవన్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి అధికారులు, నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ తదితరులు మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని దేశానికి అందించిన అంబేడ్కర్ చిరస్మరణీయుడన్నారు. డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, బీసీ వెల్ఫేర్ డీడీ శ్రీదేవి, డ్వామా పీడీ ఉషారాణి, ఆయా శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

విశాఖ విద్య: ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏయూ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. పరిషత్ ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీ అధ్యక్షుడు డి.నరసింహులు, విద్యార్థి సంఘం నాయకులు వెంకయ్యనాయుడు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో..

ఎంవీపీకాలనీ: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పాల్గొని, అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాకేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

- ఎంవీపీ కాలనీ సెక్టార్-8లోని సత్యసాయి విద్యావిహార్‌లో విద్యార్థులు రాజ్యాంగంపై స్ఫూర్తిదాయక ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. విద్యావిహార్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణా డిగ్రీ కళాశాలలో..

మద్దిలపాలెం: అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో విద్యార్థులతో అధ్యాపకులు ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ 1949 నవంబర్ 26వ తేదీన రాజ్యాంగం ఆమోదం పొందిన సంగతి తెలిసిందేనన్నారు.హిస్టరీ అధ్యాపకురాలు పి. రూపవాణి, పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలు ధనలక్ష్మి రాజ్యాంగ ప్రవేశిక, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో పోలా ఉమామహేశ్వరరావు, వి.సూర్యనారాయణ, బి.లక్ష్మి, ఎం.బాలకృష్ణ పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులను అందజేశారు.

విద్యార్థుల ప్రతిజ్ఞ

డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో అధ్యాపకులు ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా లభించిన హక్కులు, విధులు, చట్టాలను గురించి వివరించారు.

బీచ్‌రోడ్డు: రామ్‌నగర్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి 28వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు పూల మాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలకు కల్పించిన హక్కుల గురించి వివరించారు. వార్డులోని వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వీసీ ఆచార్య శశిభూషణరావు, ఆచార్యులు



ఐఏఎస్ఈలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నాగరాజకుమారి



ఏయూ లా కాలేజీలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు



ఎంవీపీ కాలనీ సంక్షేమ భవన్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ఘనంగా వీఎంఏ వార్షికోత్సవం



ప్రముఖ వ్యాపారి గుంటూరి వినోద్‌ను సత్కరిస్తున్న వీఎంఏ ప్రతినిధులు



పద్మావతి శారనాథన్ గాత్ర కచేరీ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ 55వ వార్షిక సంగీతోత్సవాలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సభాధ్యక్షుడు రామమూర్తి, కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి దుర్గాప్రసాద్, ముఖ్య అతిథి ప్రముఖ వ్యాపారస్తుడు గుంటూరు వినోద్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం వినోద్‌ను వీఎంఏ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. చెన్నైకి చెందిన ప్రముఖ గాత్రవిదుషి పద్మావతి శారనాథన్ గాత్ర కచేరీ శ్రావ్యంగా సాగింది. వాయులీనంపై కృష్ణ, మృదంగంపై జయభాస్కర్, మోర్సింగ్‌పై వెంకటేష్ సహకారం అందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం జ్ఞానానంద ఆశ్రమంలోని గౌరీజ్ఞానలింగేశ్వర దేవస్థానంలో నాగదేవత, శివుడు సమేతంగా ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తులను పంచామృతాభిషేకాల అనంతరం పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమంలో అర్చకులు బాలభాస్కర శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

29న జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 29న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. కుశలవ ఇంటర్నేషనల్, ఎస్ఆర్ అకాడమిక్ ఆర్గనైజేషన్ లిమిటెడ్ సంస్థల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మిషన్ ఆపరేటర్స్, షిఫ్ట్ సూపర్‌వైజర్స్, సేల్స్ అండ్ సర్వీస్ ఇంజినీర్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన 18-35 సంవత్సరాల వయసు గల వారు అర్హులన్నారు.

సంకల్పబలంతో కాలినడకన తిరుమలకు..



సీతమ్మధార నుంచి కాలినడకన బయలుదేరిన గోవింద మాలధారులు

సీతమ్మధార : సంకల్ప బలంతో ఏదైనా సాధించ వచ్చని విశాఖ నాగరానికి చెందిన వృద్ధ మిత్రులు నిరూపిస్తున్నారు. ఆరు పదుల వయస్సు దాటినా సరే ఉత్సాహం, దైవ భక్తితో గోవింద మాల ధరించి సీతమ్మధార నుంచి మంగళవారం ఉదయం తిరుమల వేంకటేశ్వరుని సన్నిధికి కాలినడకన బయలుదేరారు. 21 రోజులపాటు సాగే ఈ యాత్ర యువతలో స్ఫూర్తి నింపుతుందని 15 సార్లు కాలినడకన తిరుమల యాత్ర చేసిన డి.వెంకటరావు (67) పేర్కొన్నారు. దారిపొడవునా వేంకటేశ్వరుని గీతాలు ఆలపిస్తూ ప్రజల్లో భక్తిభావం పెంపొందిస్తామని తెలిపారు. తనతోపాటు 15 సార్లు యాత్ర చేసిన ఎస్.సన్యాసి రావు (82), ఏడు సార్లు యాత్ర చేసిన డి.ఎస్.ఎన్.మూర్తి (65), తొలిసారి రామ్మూర్తి రాజు (74) వస్తున్నారని తెలిపారు. తిరుగు ప్రయాణంలో రైలు మార్గంలో విశాఖ వస్తామని తెలిపారు.

ఆరుద్ర కవిత పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆవంత్స సోమసుందర్, ఆరుద్ర శత జయంతి ఉత్సవాలు ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు శాఖ, అరసం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏయూ తెలుగు విభాగంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అరసం ప్రచురించిన 'ఆరుద్ర కవిత' పుస్తకాన్ని వీసీ ఆచార్య శశిభూషణరావు ఆవిష్కరించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వై.విజయకుమార్, మార్కిస్ట్ అధ్యయన కేంద్రం నిర్వాహకుడు జె.వి.సత్యనారాయణమూర్తి, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు మేడిపల్లి రవికుమార్, ఆచార్య చందు సుబ్బారావు, అరసం నాయకులు ఉప్పల అప్పలరాజు, క్షేత్రపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్



యూపీహెచ్‌సీలో ల్యాబ్ రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆరిలోవ: ఆరిలోవ కాలనీలోని తోటగరువు యూపీహెచ్‌సీని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం సందర్శించారు. అక్కడి రికార్డులు తనిఖీ చేశారు. ల్యాబొరేటరీలో రోగులకు జరిపిన వైద్య పరీక్షల రికార్డును పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆస్పత్రి వైద్యులను అగిడి తెలుసుకున్నారు.

రోజువారీ ఓపీ సంఖ్య, రోగులకు అందించే మందులు, ప్రస్తుతం నిల్వ ఉన్న మందుల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులతో మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో అందాల్సిన వైద్య సేవల గురించి సూచనలు ఇచ్చారు. ఓపీ సంఖ్యను పెంచే విధంగా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు.

ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రిలో వీడియో కలకలం

ఆరిలోవ: హనుమంతవాక వద్ద ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో మంగళవారం బాత్‌రూంకు వెళ్లిన మహిళను ఓ వ్యక్తి వీడియో తీయడంపై హడావిడి నెలకొంది. కంటి చెకప్ కోసం ఓ మహిళ ఆస్పత్రికి వెళ్లారు. ఆమె బాత్‌రూంకు వెళ్లడం గమనించిన ఓ వ్యక్తి ఆమె వెంట వెళ్లి వీడియో తీశాడు. దాన్ని గమనించిన అక్కడి సెక్యూరిటీ సిబ్బంది అతనిని పట్టుకొని, సెల్‌ఫోన్ తీసుకుని ఆ వీడియో డిలీట్ చేసినట్లు తెలిసింది. దీనిపై ఆస్పత్రి నిర్వాహకులు ఆరిలోవ పోలీసులకు ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఆస్పత్రికి చేరుకొని విషయం తెలుసుకున్నారు. అయితే దీనిపై ఆస్పత్రి నిర్వాహకులు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయలేదు.

చలికి వణుకుతున్న సంక్షేమ హాస్టల్ విద్యార్థులు

మద్దిలపాలెం: రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థినీ విద్యార్థులు చలికి గజగజ వణికిపోతున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఓబీసీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి మూల వెంకటరావు అన్నారు. వీరికి ప్రభుత్వం దుప్పట్లు, కార్పెట్లు, చాపలు సైతం పంపిణీ చేయకపోవడంతో చలి తీవ్రతను తట్టుకోలేక అవస్థలు పడుతున్నారన్నారు. పలు హాస్టళ్లు శిథిలావస్థకు చేరాయని, కనీస సౌకర్యాలు కరువయ్యాయని పేర్కొన్నారు. గత రెండు రోజులుగా అర్ధరాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలకు పడిపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కటిక నేలపై పడుకోవాల్సి రావడంతో అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. చాలా వసతి గృహాలకు తలుపులు, కిటికీలు సరిగ్గా లేకపోవడంతో చలి మరింత పెరిగి, నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారన్నారు. ఒక దుప్పటిని ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు కప్పుకొనే పరిస్థితి ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గంలో చాలా కళాశాల హాస్టళ్లలో దుప్పట్లు లేవని, చలి నుండి రక్షణకు దగ్గర దగ్గరగా పడుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రి తక్షణమే వారికి మెరుగైన సదుపాయాలు కలగజేయాలని వెంకటరావు కోరారు.

24 గంటల్లో మిస్సింగ్ కేసుల ఛేదన

ఎంవీపీకాలనీ: ఇటీవల నమోదైన రెండు మిస్సింగ్ కేసులను ఎంవీపీ పోలీసులు 24 గంటల వ్యవధిలో ఛేదించారు. 501/24, 502/24 గా నమోదైన ఈ కేసుల్లో ఒకటి ఇంటి నుంచి వెళ్లిపోయిన వివాహితుడిది కాగా మరొకటి పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయిన వివాహితదిగా పోలీసులు వెల్లడించారు. వారి ఆచూకీ గుర్తించి మంగళవారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 24 గంటల వ్యవధిలో ఈ కేసులను ఛేదించడంపై నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఎంవీపీ పోలీసులను అభినందించారు

వ్యాధులపై అప్రమత్తత అవసరం

జగదాంబ: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోన్ - 4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. మంగళవారం ఆయన జోన్ పరిధిలోని బబ్బర్‌తోట, గొల్లవీధి ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడ ప్రజలు తాగుతున్న మంచి నీటిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాతటైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు ఇంటి ఆవరణలో ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం వార్డులోని కాలువలు, రహదారులు పరిశీలించారు. చెత్త సేకరణపై ఆరా తీశారు. పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి చెత్త తీసుకెళ్లాలని, వీధుల్లోని చిన్న చిన్న కాలువలను రోజూ శుభ్ర పరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో తాగునీటి సరఫరా విభాగం అధికారులు మురళీకృష్ణ, వాసుదేవన్, ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.